

ఫ్లైట్‌లో వెళ్లి.. పేకాట ఆడి !

సిరిసిల్ల: జిల్లాకు చెందిన పేకాటరాయుళ్లు కొత్త పంథాను ఎంచుకున్నారు. పేకాట ఆడేందుకు ఫ్లైట్లలో గోవా, శ్రీలంక వెళ్లి వస్తున్నారు. ఇలా వెళ్లేందుకు ఒక్కొక్కరు రూ.4లక్షల చొప్పున డిపాజిట్ చేస్తున్నారు. ఇలా పేకాట వ్యసనానికి బానిసైన వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. జిల్లాలో పేకాటరాయుళ్ల వింత పోకడపై స్పెషల్ స్టోరీ..

- వివరాలు లోపలి పేజీల్లో..

న్యూస్‌రీల్

బ్లడ్ కేంద్రంలో తనిఖీలు

తనిఖీ చేసిన సెంట్రల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్



సిరిసిల్ల జిల్లా ఆస్పత్రి బ్లడ్ కేంద్రం వద్ద డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, వైద్యులు

సిరిసిల్ల: సిరిసిల్లలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ కేంద్రాన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు శుక్రవారం తనిఖీ చేశారు. సిరిసిల్ల బ్లడ్ కేంద్రం స్థాయి పెంచేందుకు, బ్లడ్ కంపోనెంట్ సౌకర్యం కల్పించేందుకు అఫెరిసిస్ పరికరాలను, కంపోనెంట్ సపరేటర్లను ఏర్పాటు చేశారు. వీటిని సెంట్రల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంగ్రాం ఉరుమడ్ల, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవాని తనిఖీ చేశారు. సిరిసిల్ల బ్లడ్ కేంద్రం స్థాయి పెంచేందుకు ఏర్పాటు చేసిన పరికరాలు బాగున్నాయని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. స్థాయి పెంపుతో సిరిసిల్ల ఆస్పత్రిలో ప్లేట్‌లెట్స్ ప్లాస్మా, పీఆర్‌బీసీ అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ చీకోటి సంతోష్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.మురళీధర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో బ్లడ్ కేంద్రం అధికారులు డాక్టర్ బి.లక్ష్మీనారాయణ, డాక్టర్ కె.అరుణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్యాంప్‌లోనే కౌన్సిలర్లు



క్యాంప్‌లో పలువురు కౌన్సిలర్లు

వేములవాడ: వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా మారుతోంది. ఈనెల 12న వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మీడియాకు ఒక్కొక్కరి చొప్పున హాల్‌లోకి అనుమతించేందుకు పాస్‌లను డీపీవో ఆఫీస్ నుంచి జారీ చేస్తున్నారు. వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం మారం కుమార్ నేతృత్వంలో కౌన్సిలర్లు క్యాంప్‌లోనే కొనసాగుతున్నారు. ఈనెల 8న బీఆర్‌ఎస్ విప్ జారీ చేయడంతో మున్సిపల్ రాజకీయాల్లో వేడి పుంజుకుంది. 16 మంది సభ్యులతో కుమార్ క్యాంపు కొనసాగుతున్నట్లు చర్చ సాగుతోంది. ప్రత్యర్థిగా బింగి మహేశ్ రంగంలోకి దిగడంతో కొందరు కౌన్సిలర్లు మహేశ్ వద్ద డబ్బులు తీసుకుని ఇబ్బందులకు గురిచేసి ఎదుటి పార్టీ నాయకులతో చేతులు కలిపినట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. ప్రస్తుతం క్యాంప్ గోవాకు చేరినట్లు తెలుస్తోంది. వీరంతా ఈనెల 12న నేరుగా వేములవాడకు చేరుకుని వైస్‌చైర్మన్ ఎన్నికల పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

జనజాతర



అమ్మవారికి మొక్కుతున్న యువతి



దేవతామూర్తులు



సిరిసిల్ల గంగాభవానీ అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



ముస్తాబాద్: చీకోడులో ఎడ్లబండ్ల ప్రదర్శన



కోనరావుపేట: మామిడిపల్లిలో గుట్టపైకి వెళ్తున్న భక్తులు

- జిల్లాలో మాఘ అమావాస్య పూజలు
- ఉప్పొంగిన భక్తి పారవశ్యం
- లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు
- నేత్రపర్వంగా కల్యాణోత్సవం
- సిరిసిల్లలో మూడు జాతర్ల ముచ్చట

సిరిసిల్లటౌన్/కోనరావుపేట(వేములవాడ): మానేరుతీరం భక్తిపారవశ్యంతో పులకించింది. ఇష్టదైవాలను ప్రసన్నం చేసుకునేందుకు భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ప్రాంతాల్లో శుక్రవారం మాఘ అమావాస్య సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. సిరిసిల్లలో మూడు జాతర్లు ముచ్చటగా సాగాయి. సిరిసిల్లలో గంగభవానీ, మడేలేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో కళ్యాణోత్సవాలు నేత్రపర్వంగా సాగాయి. గంగపుత్రుల ఆధ్వర్యంలో గంగభవానీ, నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి, రజకసంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి ఆలయాల్లో కళ్యాణోత్సవాలు నిర్వహించారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు మానేరుతీరానికి తరలివచ్చారు. మహిళలు గంగామాత, శివపార్వతులకు ఒడి బియ్యం, నూతనవస్త్రాలు సమర్పించారు. మూడు జాతర్లను పురస్కరించుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ చంద్రయ్య ఆధ్వర్యంలో డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు, జనరేటర్ ఏర్పాటు చేశారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు.

వీఐపీల తాకిడి..

కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో జనహోరు

కోనరావుపేట మండలం మామిడిపల్లి, నాగారం, ధర్మారం గ్రామాల్లో మాఘ అమావాస్య జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మామిడిపల్లిలోని సీతారామచంద్రస్వామి, నాగారంలోని కోదండ రామస్వామి, ధర్మారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ చంద్రయ్య, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, డీపీఆర్వో మామిండ్ల దశరథం తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



సిరిసిల్లలో మడేలేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



సిరిసిల్లలో మడేలేశ్వర కల్యాణం తిలకిస్తున్న భక్తులు



గంగాభవానీ కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



సిరిసిల్లలో ర్యాలీ తీస్తున్న రజకులు



కోనరావుపేట: మామిడిపల్లిలో పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో స్వామివారిని దర్శించుకుంటున్న కేకే మహేందర్‌రెడ్డి



గంగాభవానీని దర్శించుకుంటున్న ఎస్పీ అఖిల్‌మహాజన్



కల్యాణోత్సవానికి హాజరైన గంగపుత్ర సంఘం సభ్యులు

బలగం లేని బహుముఖ ప్రజ్ఞాశాలి

- తెలుగు ఠీవి.. కీర్తి.. పీవీ
- మంథని నుంచే రాజకీయ ఓనమాలు
- భారతరత్నతో పులకించిన మంత్రపురి
- 'సాక్షి' కథనంపై ప్రశంసలు



సాక్షిప్రతినిధి, కరీంనగర్/మంథని/విద్యానగర్: తెలివితేటలన్నీ ప్రభుత్వం వద్దే ఉన్నాయనుకునే మూస పద్ధతులన్నీ పక్కకుతోసి.. దేశాన్ని ఆర్థికంగా పునర్నిర్మించిన నాయకుడు, భూసంస్కరణల ఆద్యుడు.. ఆర్థిక రంగం నుంచి అణుశక్తి వరకు.. అంతర్గత భద్రత నుంచి విదేశాంగ విధానం వరకు అన్నింటా తనదైన ముద్రవేసిన తెలుగుబిడ్డ పాములపర్తి వెంకటనర్సింహారావు.. 14 భాషలను అనర్గళంగా మాట్లాడే బహుభాషా కోవిదుడు.. రాష్ట్ర, కేంద్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా పదవులకే వెన్నతెచ్చి.. ఆధునిక భారత చరిత్రను మేలు మలుపు తిప్పిన రాజనీతిజ్ఞుడు మన మంథని ముద్దుబిడ్డ పీవీ.. ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పీవీ అభిమానులు, విద్యావంతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బలగం లేకపోయినా సంప్రదాయ చట్టంలో ఇరుక్కుపోకుండా,కాలనుగుణంగా అప్‌డేట్ అవుతూ, కీర్తికి పొంగక, అవమానాలకు కుంగిపోని మౌనముని పాములపర్తి.

తొలి దక్షిణాది ప్రధాని

1921జూన్ 28న జన్మించిన పీవీ నరసింహారావు పాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన వారు. అయినా, మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. చదువుపూర్తయ్యాక న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. స్వామీ రామానంద తీర్థ శిష్యరికంలో తొలుత 1952లో కరీంనగర్ పార్లమెంట్ నుంచి పోటీచేసి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి బద్దం ఎల్లారెడ్డి చేతిలో ఓడిపోయారు. 1957లో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తర్వాత 1962, 67, 72లో వరుసగా విజయం సాధించారు. న్యాయ, సమాచార, వైద్య, దేవాదాయ శాఖల మంత్రిగా పనిచేశారు. 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా రెండేళ్లపాటు పనిచేశారు. 1977లో హనుమకొండ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి కేంద్ర రాజకీయాల్లో అడుగుపెట్టారు. 1980లో హన్మకొండ నుంచే ఎంపీగా గెలుపొందారు. 1984, 1989లో మహారాష్ట్రలోని రాంటెక్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ హయాంలో హోం, రక్షణ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలు నిర్వర్తించారు. 1991లో ప్రధానమంత్రిగా పదవి చేపట్టి తొలి దక్షిణాది పీఎంగా చరిత్ర సృష్టించారు.

'ఆపరేషన్ బ్లాక్ బోర్డు'తో

1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వంలో మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రిగా పీవీ ఉన్నసమయంలో ఆపరేషన్ బ్లాక్‌బోర్డు పేరిట సింగిల్ స్కూల్ టీచర్స్‌ను డబుల్ టీచర్ స్కూల్స్‌గా మార్చారు. అలాగే ప్రతీజిల్లాకో నవోదయ స్కూల్, కేంద్రీయ విద్యాలయం తీసుకొచ్చారు. ఆయన ప్రవేశపెట్టిన విద్యాలయాలు నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వరంగా మారాయి.

భూ సంస్కరణలు ఆయన చలవే

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పీవీ పనిచేసిన సమయంలో భూ సంస్కరణ చట్టం తీసుకొచ్చారు. భూస్వాముల నుంచి వందలాది ఎకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. స్వతహాగా భూస్వామ్య కుటుంబానికి చెందిన పీవీ.. తన వద్ద ఉన్న 1,200 ఎకరాలు వదులుకున్నారు. అడవుల్లో వన్యప్రాణులను చంపడంతో చలించిపోయి.. వాటి సంరక్షకు వన్యప్రాణి సంరక్షణ చట్టం తీసుకొచ్చారు.

'సాక్షి' కథనంపై ప్రశంసలు..

ఈనెల3వ తేదీన బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీకి, అంతకుముందు బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు కేంద్రం భారత రత్న ప్రకటించింది. ఈ సమయంలో ×మన పీవీ భారత రత్నం కాదా?₹ అని ప్రశ్నిస్తూ ఆయన సేమలను గుర్తు చేస్తూ కథనం ప్రచురితమైంది. సరిగ్గా ఐదురోజుల అనంతరం కేంద్రం కూడా పీవీకి భారత రత్న అవార్డు ప్రకటించడంతో పలువురు పాఠకులు, ప్రజాప్రతినిధులు సాక్షికి అభినందనలు తెలిపారు. పీవీ సేవలు, త్యాగాలు నేటి తరానికి తెలియజేసిన ప్రయత్నాన్ని స్వాగతించారు.

భారీ విగ్రహం పెట్టిస్తా..



తెలంగాణ బిడ్డ, భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం సంతోషకరం. కాంగ్రెస్ పార్టీకి, దేశానికి పీవీ చేసిన సేవలు వెలకట్టలేనివి. ఆయన సేవలు ముందు తరాలు గుర్తుంచుకునే విధంగా కరీంనగర్‌లో భారీ విగ్రహం పెట్టిస్తా. అందుకు సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించేలా చూస్తాం. తద్వారా ముందుతరాలకు పీవీ గొప్పతనం గుర్తుండిపోతుంది. - పొన్నం ప్రభాకర్, రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి

కేంద్రానికి కృతజ్ఞతలు



మన పీవీకి భారత రత్న రావడం సంతోషకరం. ఆయన ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎంతోపాటు పడ్డారు. దేశానికి ఆయన సేవలు ఎంత పొగిడినా తక్కువే. ఇప్పటికైనా ఆయన సేవలను గుర్తించి ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం అందజేసినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు.

- రామకృష్ణ, ప్రిన్సిపాల్, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల

ఎంతో ఆనందంగా ఉంది



బహుభాషా కోవిదుడు, రాజకీయ చాణక్యుడు అయిన ప్రధాని సేవలను ఎట్టకేలకు కేంద్రం గుర్తించింది. దేశానికి, ఉమ్మడి జిల్లాపై ఆయన చెరగని ముద్రవేశారు. నేడు కరీంనగర్‌కు వచ్చిన రైల్వేలైన్, మానేరు డ్యాం, ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ అభివృద్ధిలో ఆయన పాత్ర మరువలేనిది. ఆయనకు పురస్కారం ప్రకటించడం సంతోషం.

- వారాల ఆనంద్, కవి

సాహిత్య సవ్యసాచి



ఉత్తమ వ్యక్తిత్వమున్న మహోన్నత వ్యక్తిగా, బహుభాషావేత్తగా పీవీ తన సాహిత్య సృజన, ప్రతిభా పాటవాలను వివిధ భాషల్లో ప్రదర్శించారు. ఆయన రాసిన 'మల్లవ్వ' కథ ఆనాటి పరిస్థితులకు అద్దం పట్టింది. 'ది ఇన్‌సైడర్'లో తన రాజకీయ జీవితాన్ని మథించారు. విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'ఇన్‌సైడర్' రెండో సంపుటం కూడా పూర్తిఅయి ఉంటే పీవీ అంతరంగం సంపూర్ణంగా మనకు ఆవిష్కృతమయ్యేది. 20ఏళ్ల తరువాత పీవీకి భారతరత్న ప్రకటించడం సంతోషదాయకం.

- దాస్యం సేనాధిపతి, కవి, రచయిత సాహిత్య విమర్శకులు

ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- మున్సిపల్ దుకాణాలను అద్దెకు ఇవ్వాలి
- మినీ స్టేడియాన్ని సద్వినియోగం చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: మున్సిపల్‌లో వంద శాతం ఇంటి పన్ను, నల్లా పన్ను వసూలు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అద్దె గదులు ఖాళీగా ఉండొద్దని, కిరాయికి ఇవ్వాలని సూచించారు. సిరిసిల్లలో మొత్తం 86 గదులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు తెలపగా.. పూర్తి స్థాయిలో అద్దెకు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిమ్, ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్, పెద్ద పెద్ద దుకాణాలకు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. సిరిసిల్లలో ఇంటి పన్ను 69 శాతం, నల్ల బిల్లులు 49 శాతం వసూలు చేశామని తెలపగా.. వచ్చే నెలలోగా వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ట్రేడ్ లైసెన్స్‌లు నిబంధనల మేరకు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని వివరించారు.

మినీ స్టేడియాన్ని సద్వినియోగం చేయాలి

మినీ స్టేడియంలో స్కేటింగ్ ట్రాక్, క్రికెట్ నెట్‌లో బౌలింగ్ మిషన్ ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించాలని, అన్ని ఆటలు స్టేడియంలో ప్రాక్టీసు చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. స్టేడియాన్ని విద్యార్థులు, యువత వినియోగించుకునేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఏడాదికి వినియోగ చార్జీలు రూ.100 చొప్పున వారం రోజుల్లోగా వసూలు చేయాలన్నారు. స్టేడియంలో వివిధ ప్రైవేట్ ఈవెంట్ల నిర్వహణకు ఇప్పుడు ఉన్న రుసుం పెంచాలన్నారు. సిరిసిల్లలోని కొత్త చెరువు బండ్ అండ్ పార్క్‌కు టెండర్లు నిర్వహించి మంచి అనుభవం ఉన్న ప్రైవేటు వారిని నిర్వహణకు అప్పటించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయి వాలీబాల్ ట్రోఫీ పోటీలకు ఇప్పటి వరకు 8 టీమ్‌లు మాత్రమే నమోదు చేసుకున్నాయని, ఎంట్రీ ఫీజ్‌తో కొన్ని టీమ్‌లు వాలీబాల్ పోటీలకు ముందుకు రావడం లేదన్నారు. ఎంట్రీ ఫీజు లేకుండా నమోదుకు అవకాశం ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఈవో రమేశ్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారి, డీవైఎస్‌వో రాందాస్, డీపీఆర్వో ఎం.దశరథం తదితరులు పాల్గొన్నారు.

మోడల్ లేఅవుట్ సిద్ధం చేయండి

వేములవాడ శివారులోని తిప్పాపూర్, మారుపాకలోని 32 ఎకరాల్లో మోడల్ లేఅవుట్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. వేములవాడ ఆర్డీవో, మున్సిపల్ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 32 ఎకరాలలో మోడల్ లేఅవుట్‌లో పూర్తిస్థాయిలో రోడ్డు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు నాణ్యతతో నిర్మించాలని ఆదేశించారు. ఈ లేఅవుట్ కోసం భూమిని ఇస్తున్న వారికి అదే డెవలప్‌మెంట్ లే అవుట్‌లో ఇవ్వాలని, దీనికోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆ స్థలం మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. వేములవాడ ఆర్డీవో మధుసూదన్, కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ మహేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కులం పేరుతో దూషిస్తే చర్యలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కులం పేరుతో దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన దాసరి కృష్ణంరాజును ఎల్లారెడ్డిపేటకు చెందిన సందుపట్ల రాంరెడ్డి, సందుపట్ల సత్తవ్వ, సందుపట్ల లక్ష్మారెడ్డి కులం పేరుతో దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో టీ హోటల్ నిర్వహిస్తున్న కృష్ణంరాజును ఆ స్థలం తమదంటూ కులం పేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో డీఎస్పీ హోటల్ నిర్వహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడే విచారణ చేపట్టారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ ఉన్నారు.

పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చిన్నలింగాపూర్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు మహిళలను గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు మహిళలు అనాథ ఆశ్రమం పేరుతో గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ చందాలు వసూలు చేశారు. అనుమానం వచ్చిన గ్రామస్తులు గట్టిగా ప్రశ్నించడతో నీళ్లు నమిలారు. దీంతో డయల్ 100కు కాల్ చేయడంతో తంగళ్లపల్లి పోలీసులు గ్రామానికి చేరుకుని మహిళలను ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వివాహితను కాపాడిన ఎస్సై

బోయినపల్లి(చొప్పదండి): అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకునేందకు ప్రయత్నించిన మండలంలోని వెంకట్రావుపల్లికి చెందిన వివాహితను ఎస్సై శ్రీకాంత్ రక్షించారు. వెంకట్రావుపల్లికి చెందిన వివాహితకు అప్పులు ఎక్కువ కావడంతో ఎలా తీర్చాలో తెలియక మిడ్‌మానేరు ప్రాజెక్టులో ఆత్మహత్య చేసుకునేందుకు గురువారం రాత్రి తన కూతురిని తీసుకుని వెళ్లింది. గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ వివాహితను రక్షించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు పాల్పడవద్దని కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఎస్సై వివరించారు.

వివాహిత అదృశ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మొర్రాయిపల్లెకు చెందిన వివాహిత పల్లె పద్మ(34) అదృశ్యమైందని ఎస్సై శేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 8 నుంచి పద్మ కనిపించకుండా పోయిందని ఆమె కుటుంబీకులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని శివంగాలపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. శివంగాలపల్లికి చెందిన ఆటో డ్రైవర్ బొమ్మెన శ్రీనివాస్, మరో ప్రయాణికుడు మునిగే లచ్చయ్యను ఆటోలో ఎక్కించుకొని శివంగాలపల్లికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో బోల్తాపడింది. గాయపడ్డ మునిగే లచ్చయ్య, శ్రీనివాస్‌లను ఆస్పత్రికి తరలించారు. కాగా కారులో ఉన్న నలుగురు శివంగాలపల్లి సమ్మక్క మైదానంలో మద్యం సేవించినట్లు గ్రామస్తులు తెలిపారు.

పీవీకి భారతరత్నపై హర్షం

- స్వీట్లు పంపిణీ చేసిన బీజేపీ నాయకులు
- హర్షం వ్యక్తం చేసిన జిల్లా ప్రజలు


పీవీ నర్సింహారావు చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల: భారత మాజీ ప్రధాని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముద్దు బిడ్డ, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇవ్వడంపై సిరిసిల్లలో హర్షం వ్యక్తమైంది. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం పీవీ నర్సింహారావు చిత్రపటం వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. భారత ప్రధానిగా పీవీ నర్సింహారావు ఆర్థిక సంస్కరణకర్తగా చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. దేశంలోనే అత్యున్నత భారతరత్న అవార్డును ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, నాయకులు గజభీంకార్ చందు, చొప్పదండి అంజన్న, కోడం ఆనంద్‌బాబు, ఎనగంటి నరేశ్, పోతు శ్రీనివాస్, గాజుల సదానందం, జంపా రాజు, వేముల రజనీకాంత్, మొగిలి రాజు, మురళి, అనిల్, సురేశ్, శ్రీహరి పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: తెలంగాణ ముద్దుబిడ్డ, దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర సర్కారు భారతరత్న ప్రకటించడం హర్షణీయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. సిరిసిల్లలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పీవీ నర్సింహారావును ఆ పార్టీ, సోనియాగాంధీ కుటుంబం విస్మరించిందన్నారు. రాజకీయాల్లో ఠీవి తనంతో మౌనమునిగా కీర్తిగడించిన పీవీ నర్సింహారావును మోదీ సర్కారు పార్టీలకతీతంగా గౌరవించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో..

సిరిసిల్లకల్చరల్: పీవీ నరసింహారావు 1967 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డితో కలిసి సిరిసిల్లకు వచ్చారు. చంద్రంపేట ప్రాంతంలో బహిరంగసభలో పాల్గొన్నారు. అయితే ఆ ఎన్నికల్లో స్థానిక అభ్యర్థి జె.నరసింగరావు ఓటమి పాలయ్యారు. మళ్లీ 1972 ఎన్నికల్లో జె.నరసింగరావు మరోసారి అసెంబ్లీ బరిలో దిగగా.. రెండోసారి పీవీ నరసింహారావు సిరిసిల్లకు వచ్చారు.

రాజన్నపేటలో శిలాఫలకం ధ్వంసం

- మంత్రి పొన్నం ప్రారంభించి పది రోజులకే ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు


ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాజన్నపేటలో గత నెల 30న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రగతి భవన్ ప్రాంగణాన్ని ప్రారంభించిన శిలాఫలకాలను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం రాజన్నపేటలో ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం కలకలం సృష్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి దుండగుల కోసం గాలిస్తున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య విలేకరులతో మాట్లాడారు. రాజన్నపేటలో శిలాఫలకాలు ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేశారు. గత నెల 30న ప్రారంభించిన శిలాఫలకాలను కొందరు రాజకీయ నాయకులు ఓర్వలేక ధ్వంసం చేశారని ఆరోపించారు. దుండగులను పట్టుకొని చట్టపరంగా వారిని శిక్షించాలన్నారు. కొంతమంది నాయకులు ఇంకా అహంకారంగా మెదులుతున్నారని, వారి బాగోతాలను బట్టబయలు చేస్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు ఎస్‌కే గౌస్, బుగ్గ కృష్ణమూర్తిశర్మ, గోగూరి బాపురెడ్డి, కటికె రవి తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

రాజన్నపేట గ్రామపంచాయతీ కార్యదర్శి గోసికంటి రవి ఫిర్యాదుతో శిలాఫలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ తెలిపారు. దాదాపు రూ.20వేల వరకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

బద్దిపోచమ్మకు బోనం మొక్కు



వేములవాడ: సమ్మక్క జాతర సందర్భంగా వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు అమావాస్యను సైతం పట్టించుకోకుండా శుక్రవారం భారీగా తరలివచ్చారు. రాజన్న దర్శనం అనంతరం భక్తులు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.

18న ఉపాధిహామీ కూలీల సమావేశం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఈనెల 18న నిర్వహించే ఉపాధిహామీ కార్మికుల జిల్లాస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నాగరాజు కోరారు. మండలంలోని రాళ్లపేటలో శుక్రవారం ఉపాధిహామీ కూలీలతో సమావేశమయ్యారు. అతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మహేందర్‌రెడ్డి, సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

24 నుంచి సర్టిఫికెట్ కోర్సులకు పరీక్షలు

సిరిసిల్లక్రైం: వృత్తి విద్యనభ్యసించే విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు ఈనెల 24 నుంచి ప్రారంభమవుతాయని జిల్లా పరీక్షల నియంత్రణ సహాయాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. 305 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ అంబేడ్కర్‌నగర్‌లోని హైస్కూల్‌లో, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్, హైయర్ వెంకంపేట జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షలు ఉంటాయని వివరించారు.

లింగన్నపేట పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్

- జిల్లాలో ఇప్పటికే 9 ఆరోగ్య కేంద్రాలకు సర్టిఫికేషన్


లింగన్నపేట పీహెచ్‌సీ

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ వచ్చింది. ఈమేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు శుక్రవారం సర్టిఫికెట్ అందింది. నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ సెంటర్(ఎన్‌హెచ్ఎస్ఆర్సీ) నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను చేరుకుంటేనే ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ జారీచేస్తారు. ఆ అర్హతను లింగన్నపేట పీహెచ్‌సీ సాధించింది. సర్టిఫికెట్‌కు మూడేళ్ల వ్యాలిడిటీ ఉంటుంది. ఆస్పత్రి అభివృద్ధికి కేంద్రం నుంచి ఏటా రూ.3లక్షల చొప్పున రూ.9లక్షలు రానున్నాయి. తద్వారా మరింత మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందనున్నాయి.

జిల్లాలో 9 ఆరోగ్య కేంద్రాలకు సర్టిఫికెట్లు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం లింగన్నపేటతో కలిపి 9 ఆరోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్లు వచ్చాయి. కోనరావుపేట, తంగళ్లపల్లి, బోయినపల్లి, కొదురుపాక, సిరిసిల్ల పీఎస్ నగర్ అర్బన్, నేరెళ్ల, విలాసాగర్, వేములవాడ ఏరియా ఆస్పత్రులకు సర్టిఫికెట్లు వచ్చాయి.

మెరుగైన వైద్య సేవలు

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇప్పటికే మౌలిక వసతులు మెరుగయ్యాయి. విలువైన వైద్యపరికరాలు అందుబాటులోకి వచ్చినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఓపీ, ఐపీ, సర్జికల్ విభాగాల్లో నాణ్యమైన సేవలు అందుతున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ ఆస్పత్రులు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్‌ను చేజిక్కించుకున్న జిల్లాగా రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రత్యేక గుర్తింపును పొందింది.

కలెక్టర్ సంపూర్ణ సహకారంతోనే..



కలెక్టర్ అనురాగ్ జయంతి సంపూర్ణ సహకారం, నిరంతర పర్యవేక్షణతో ఇప్పటి వరకు జిల్లాలోని ఏడు పీహెచ్‌సీలకు, ఒక ఏరియా ఆస్పత్రికి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ వచ్చింది. ఆయా దవాఖానాలకు మూడేళ్ల ప్రభుత్వం నుంచి రూ.9లక్షలు రానున్నాయి. ఇకపై మెరుగైన వైద్య సేవలందుతాయి.
– రజిత, జిల్లా ఉప వైద్యాధికారి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు


జెండా ఆవిష్కరిస్తున్న గన్నమనేని శ్రీనివాసరావు

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించి, పీఆర్‌సీని వీలైనంత త్వరగా అమలు చేయాలని, ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు కోరారు. పీఆర్‌టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేజీబీవీలలో పనిచేస్తున్న సిబ్బందికి మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అనంతరం పీఆర్‌టీయూ టీఎస్ సీనియర్ నాయకులు రిటైర్డ్ ఉపాధ్యాయులు నల్ల సత్యనారాయణ, మచ్చ ఆనందం, బత్తుల మధుసూదన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, నీలి శ్రీనివాస్, మాడిశెట్టి మహేశ్, చిప్ప యాదగిరి, మాన్వాడ శంకర్, బానాల మల్లారెడ్డి, గుర్రం దేవదాస్, గుర్రం మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, పోలుక ఆనంద్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

- రూ.15లక్షలతో ఏర్పాటు
- రూ.5.50లక్షలు అందజేసిన ఎమ్మెల్యే కేటీఆర్


ఐలమ్మ విగ్రహం ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ శుక్రవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఐలమ్మ వీరోచిత పోరాటం అన్నివర్గాలకు స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ సమరయోధులకు బీఆర్‌ఎస్ పార్టీ ఆది నుంచి ప్రాధాన్యతనిస్తుందన్నారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ చౌరస్తాలో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సొంతంగా రూ.5.50 లక్షలతో విగ్రహాన్ని అందించారని తెలిపారు. మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.9.50లక్షలతో గద్దెను నిర్మించినట్లు వివరించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, గూడూరి ప్రవీణ్, పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు దండు శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పుకార్లు ప్రచారం చేస్తే చర్యలు

సిరిసిల్లక్రైం: ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పిల్లలను తీసుకెళ్తున్నట్లు పుకార్లు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. పిల్లలను కిడ్నాప్ చేసే గ్యాంగ్ జిల్లాలో సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న సమాచారం వాస్తవం కాదన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎక్కడో జరిగిన వీడియాలను జిల్లాలో పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని, తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే గూరప్ అడ్మిన్‌పై కేసు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో నిరంతర నిఘా కొనసాగుతుందని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పెట్రోలింగ్, బ్లూకోట్స్ వాహనాలతో గస్తీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోకి ఎవరు ప్రవేశించిన వారి కదలికలను గుర్తించేందుకు సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ఉందని వెల్లడించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా వీడియోలు ప్రచారం చేయొద్దని సూచించారు.

డ్రగ్స్ నిర్మూలనపై వ్యాసరచన పోటీలు

సిరిసిల్లక్రైం: యువతను పెడదారి పట్టించే డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై ఈనెల 15న జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం తెలిపారు. జిల్లాలోని విద్యార్థులకు గతేడాది యాంటి డ్రగ్ క్లబ్స్‌ను ఏర్పాటు చేశామని, దీనిలో భాగంగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు వివరించారు. గత నెలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభచూపిన వారు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన వెంకట్‌రెడ్డి

- మాజీ సర్పంచ్‌లతో కలిసి త్వరలోనే కాంగ్రెస్‌లోకి..


డీకే శివకుమార్‌ను కలిసిన వెంకట్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట తాజా, మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నేవూరి వెంకట్‌రెడ్డి శుక్రవారం కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను బెంగళూర్‌లో కలిశారు. కొద్ది రోజులుగా వెంకట్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో డీకే శివకుమార్‌ను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే పలువురు తాజా మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో త్వరలోనే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే వెంకట్‌రెడ్డి డీకే శివకుమార్‌ను కలిసినట్లు ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ఇప్పటికే మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లతో వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. ఓ మండలానికి చెందిన జెడ్పీటీసీతో కలిసి కాంగ్రెస్‌లో చేరడానికి ముహూర్తం ఖరారైనట్లు విశ్వసనీయంగా తెలిసింది.

మహిళా డిగ్రీ కాలేజీలో న్యాక్ బృందం


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న న్యాక్ బృందం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళా సంక్షేమ డిగ్రీ కళాశాలను శుక్రవారం న్యాక్ బృందం సందర్శించింది. న్యాక్ అక్రిడేషన్ పొందేందుకు కావాల్సిన రికార్డులు పరిశీలించారు. సిద్దిపేట డిగ్రీ, పీజీ కళాశాలల ప్రొఫెసర్లు మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ అయోధ్యరెడ్డి, డాక్టర్ రవికుమార్, గిరిజన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు పనిభారం తప్పించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

సిరిసిల్లటౌన్: ఆశవర్కర్లకు అధిక పనిభారం నుంచి విముక్తి కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కోడం రమణ మాట్లాడుతూ రెండు నెలలుగా ఆశవర్కర్లకు పారితోషికాలు అందడం లేదన్నారు. పద్దెనిమిదేళ్లుగా పనిచేస్తున్న ఆశలపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నెలకు రూ.18వేల జీతం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈమేరకు కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రం అందించారు.

న్యాయం చేస్తాం: కేకే మహేందర్‌రెడ్డి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్ల వద్దకు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి వచ్చి మాట్లాడారు. ఆశవర్కర్ల సమస్యలను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, యెల్లె లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఆశవర్కర్స్ యూనియన్ జిలా అధ్యక్షురాలు బదవేని మంజుల, కార్యదర్శి గుమ్మడి జయశీల, లత, చంద్రకళ, మమత, లావణ్య, భాగ్యలక్ష్మి, రుచిత, రేణుక, ఒగ్గు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

సిరిసిల్ల: జిల్లా రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ కోరారు. రుద్రంగి మండలంలోని ఆయిల్‌పామ్ తోటలను, వరి పొలాలను శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు యాసంగి సీజన్‌లో వేసిన పంటలపై తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను భాస్కర్ వివరించారు. వరి పంటను కాండం తొలిచే పురుగు ఆశిస్తుందన్నారు. వరి పొలంలో పురుగుల ఉధృతిని గమనించడానికి దీపపు ఎరను, లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలన్నారు. నారుమడి దశలో ఉన్న రైతులు నారుమడిలోనే కార్బోఫురాన్ 3సీజీ గుళికలను లేదా 600 గ్రాముల ఫిప్రొనిల్ 0.3జీ గుళికలను వేయాలన్నారు. నారుమడి దాటి 15 రోజుల పిలక దశలో ఉన్న వరి పొలంలో తప్పకుండా ఎకరాకు కార్బోఫురాన్ 3సీజీ గుళికలు, లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు లేదా క్లోరంత్రానిలిప్రోల్ 4జీ గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలని సూచించారు.

ఉద్యానపంటలు పరిశీలించిన రైతులు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులు, డైరెక్టర్లు కలిసి వెళ్లిన విజ్ఞాన యాత్ర రెండో రోజు శుక్రవారం మహారాష్ట్రలో కొనసాగింది. నాసిక్ మార్కెట్ కమిటీ పరిధిలోని ఉద్యానవన పంటలను పరిశీలించారు. అక్కడి రైతులు సాగు చేస్తున్న ద్రాక్ష తోటలను పరిశీలించి, సాగు విధానం, మార్కెటింగ్ గురించి తెలుసుకున్నారు. జిల్లా నుంచి వెళ్లిన రైతులు, డైరెక్టర్లకు అక్కడే స్థిరపడ్డ ఈ ప్రాంతవాసి వ్యాపారి బొల్గం రాధాకృష్ణాగౌడ్ స్వాగతం పలికారు. అక్కడి రైతుల పంట క్షేత్రాలకు తీసుకెళ్లి వారు సాగు చేస్తున్న ద్రాక్ష, గోధుమ పంటల గురించి ఆ ప్రాంత రైతులతో అవగాహన కల్పించారు. విజ్ఞానయాత్రలో పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ జంగేటి సత్తయ్య, డైరెక్టర్లు ల్యాగల సతీశ్, ప్రభాకర్‌రావు, నేవూరి వెంకటనరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కనకట్ల సుధాకర్, సీఈవో కిశోర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ లీడర్లే రేషన్ డీలర్లు'

సిరిసిల్లటౌన్: జిల్లాలో కొందరు బీఆర్‌ఎస్ నేతలే రేషన్‌డీలర్లుగా కొనసాగుతున్నారని కాంగ్రెస్ తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు జాలుగం ప్రవీణ్(టోని) కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్లతోపాటు తంగళ్లపల్లిలో పలువురు రేషన్ డీలర్లను పదకొండేళ్లుగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి ఒత్తిడితో తాత్కాలికంగా రేషన్ షాపులను మహిళా గ్రూపులకు అప్పగించినప్పటికీ, వాటిని నిర్వహించేది బీఆర్‌ఎస్ లీడర్లేనన్నారు. వారి వివరాలతోపాటు కలెక్టర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్, స్థానిక ఆర్డీవో, తహసీల్దార్లకు వివరించినట్లు తెలిపారు. బినామీ పేర్లతో రేషన్‌షాపులు నడిపిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. సుమారు 86 తాత్కాలిక పద్ధతిలో నడుస్తున్న షాపులకు అర్హులకు అప్పగించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

మట్టి నిల్వలపై మైనింగ్ ఏడీ విచారణ

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో మార్కెట్‌యార్డు పరిసరాల్లోని మట్టినిల్వలపై శుక్రవారం మైనింగ్ ఏడీ రఘుబాబు విచారణ చేపట్టారు. ఆర్ఐ బాలయ్యతో కలిసి సంఘటన స్థలంలో పంచనామా నిర్వహించారు. మైనింగ్ ఏడీ రఘుబాబు మట్లాడుతూ మట్టి నిల్వలు ఉన్న స్థలానికి సంబంధించిన పట్టాదార్లను విచారించారు. ఇటుకబట్టి వ్యాపారి ఇరిగేషన్, గ్రామపంచాయతీ అనుమతి పత్రాలు చూపించడంతో అద్దెకు ఇచ్చినట్లు స్థల యజమానులు తెలిపారన్నారు. మట్టి నిల్వల అనుమతుల విషయంలో ఇరిగేషన్ అధికారులతో స్పష్టత తీసుకున్న తర్వాత చర్యలు తీసుకుంటామని ఏడీ స్పష్టం చేశారు. మట్టిని తరలించొద్దని ఆదేశించారు.

మర్తనపేటలో మూడిళ్లలో చోరీ

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం మర్తనపేటలో ఒకే రోజు శుక్రవారం మూడిళ్లలో దొంగలు పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం మర్తనపేటకు చెందిన బోనాల నర్సయ్య ఇంట్లో గురువారం రాత్రి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు 5 తులాల బంగారం నగలు, 20 తులాల పట్టగొలుసులు, రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన గుమ్మడిదారి గౌరవ్వ ఇంట్లో పశువుల డాక్టర్ సాగర్ అద్దెకు ఉంటున్నాడు. ఈ ఇంట్లో చొరబడిన దొంగలు రూ.2వేల నగదు ఎత్తుకెళ్లారు. మోకెనపల్లి లక్ష్మి ఇంట్లో ఏమీ దొరక్కపోవడంతో వెనుదిరిగారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌లతో ఆధారాలు సేకరించారు.

ఇంట్లో అగ్నిప్రమాదం.. తప్పిన ప్రాణహాని

సిరిసిల్లక్రైం: ఇంట్లో దేవుడి ఎదుట వెలిగించిన దీపంతో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన జిల్లా కేంద్రంలోని శుక్రవారం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు. విద్యానగర్‌కు చెందిన మామిండ్ల రమేశ్ ఇంట్లో దేవుడి ప్రతిమ ఎదుట దీపం పెట్టి జాతరకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి మంటలు అంటుకున్నాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు మంటలను ఆర్పివేశారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణహాని తప్పింది. దాదాపు రూ.1.90 లక్షల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. మంటలను ఆర్పి వేయడంలో లీడ్ ఫైర్‌మన్ మహిపాల్, డ్రైవర్ ఆపరేటర్ ఎల్.నవీన్‌కుమార్, ఫైర్‌మన్ శాబీర్ పాల్గొన్నారు.